

రాజన్న ఆలయంలో పూజ చేస్తున్న మోదీ



ప్రధానికి జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ నేతలు

మాట్లాడుతున్న బండి సంజయ్

కమలోత్సాహం

- వేములవాడలో మోదీ సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- రాజన్న ఆలయంలో 30 నిమిషాలు గడిపిన ప్రధాని
- బండి సంజయ్ విజయం ఖాయమైందని అనడంతో హోరెత్తిన సభ

● రాజన్నకు పూజలు, కోడె మొక్కు

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం వేములవాడకు వచ్చిన ఆయన రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామిని, రాజరాజేశ్వరస్వామి వారిని, రాజరాజేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, నమిలికొండ ఉమేష్‌శర్మ ప్రధాని మోదీకి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

సిరిసిల్ల/వేములవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నా యకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లు కొట్టి ఉత్సాహం కనబరిచారు. బుధవారం ఎన్నికల వేములవాడ జన బహిరంగ సభకు వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో పూజ, దర్శనం అనంతరం బహిరంగ సభ వద్దకు మోదీ చేరుకున్నారు. ప్రధాని ప్రసంగాన్ని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అనువదించారు.

నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారం

ప్రధాన మంత్రి 'నా తెలంగాణ.. కుటుంబ సభ్యులకు నమస్కారాలు' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు.దీంతో సభకు హాజరైన ప్రజలు కేరింతలు, చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. దక్షిణ కాశీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని మీ ఆశీర్వాదం కోసం వచ్చానని మోదీ కోరారు.

● ఉదయం 10 గంటలకే ఇంత జనమా..

సభ ఉదయం 10 గంటలకే జరిగినా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంపై మోదీ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గుజరాత్‌లో మూడు సార్లు సీఎంగా పని చేసినా, ఎన్నో ఎన్నికలు చూసినా, ఇంత ఉదయమే పెద్ద ఎత్తున్న ప్రజలు తరలిరావడం ఎక్కడా చూడలేదన్నారు. బండి సంజయ్‌ని చేయి పట్టి అభినందించారు. తమ పై చూపిస్తున్న ప్రేమాభిమానానికి శిర స్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విజయం ముందే ఖాయమైందన్నారు. సభ జరుగుతుండగా బీజేపీ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

● కట్టుదిట్టమైన భద్రత

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పోలీసులు వేములవాడలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అడుగుఅడుగునా చెక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఎస్ఎస్‌జీ, భద్రతా బలగాలు, పోలీసులు 1200 మందితో బందోబస్తు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించాయి.

● కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

ప్రధాని నరేంద్రమోదీ తన ప్రసంగంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మాట్లాడిన ఆయన కాంగ్రెస్ సరైన దర్యాప్తు జరగకుండా బీఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు, సిండికేట్ పార్టీలేనని అ న్నారు. కరీంగనర్‌లో బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గురించి ఎవరికీ తెలియదన్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ తీవ్రంగా అవమానించిందని విమర్శించా రు. పీవీ మరణం తరువాత ఆయ న పార్థివదేహా న్ని గౌరవించకుండా బయటకు తరలించిందన్నారు. పీవీకి భారత రత్నతో గౌరవించిన ఘనత బీజేపీదేనని తెలిపారు. 13న కాంగ్రెస్, బీఆర్ఎస్ పాపాల లెక్కను తేల్చాలని, కరీంనగర్ నుంచి బండి సంజయ్, అదిలాబాద్ నుంచి గోడెం నగేష్, పెద్దపల్లి నుంచి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సభకు రాలేని వారికి వచ్చిన వారు తన తరఫున నమస్కారం చెప్పాలని కోరారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులు

● పరిమిత సంఖ్యలో భక్తులకు అనుమతి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలయ సందర్శన నేపథ్యంలో బుధవారం ఉదయం భక్తులను, అర్చకులను, సిబ్బందని పరిమిత సంఖ్యలో ఆలయంలోకి అనుమతించారు. మోదీ ఆలయంలోకి ప్రవేశించిన సమయంలో సర్వదర్శనం నిలిపివేశారు.

● రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని

రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న తొలి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నప్పటికీ దేశంలోనే అత్యున్నత పదవి అయిన ప్రధాన మంత్రి హోదాలో ఉన్న వారెవరూ వేములవాడను సందర్శించలేదు.

పర్యటన సాగిందిలా..

- ఉదయం 9.20: హెలీక్యాప్టర్‌లో వేములవాడకు చేరుకున్నారు.
- 9.25: రాజరాజేశ్వరసామి ఆలయానికి చేరుకున్నారు. 30 నిమిషాలసేపు ఆలయంలో పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు.
- 10.10: బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు.
- 11.18 నిముషాలకు తిరుగు ప్రయాణం.

ప్రధాని సభ సైడ్‌లైట్స్

- ప్రధాని పర్యటన సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో నాలుగు హెలికాప్టర్లు దిగడంతో జనం వాటిని ఆసక్తిగా చూస్తూ సెల్ ఫోన్లలో బంధించారు.
- ఆలయానికి చేరుకున్న ప్రధానికి పూర్ణకుంభంతో ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. ప్రధానమంత్రి ఆలయంలో దాదాపు 30 నిముషాల పాటు గడిపారు. అర్చకులు మోదీకి రాజన్న ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.
- వేములవాడ బైపాస్ రోడ్డులో వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక మీదికి రాగానే ప్రజలు పెద్దఎత్తున మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు.
- ప్రధానికి వేదికపై పలువురు నేతలు జ్ఞాపికలు అందించారు.
- ప్రధాని 42 నిముషాలపాటు ప్రసంగించారు.
- సభ తర్వాత జనాలు ఒక్కసారి రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ స్తంభించింది.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 8 : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలో పెద్దూర్‌లోని సింగ్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడి తడిసిన ధాన్యంతోపాటు ప్రతీ గింజ కొనే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని రైతులకు భరోస కల్పించారు. కౌన్సిలర్ భూక్య రెడ్డి నాయక్, సీనియర్ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి, గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ర్యాకం రమేష్, ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, ర్యాకం అనిల్‌కుమార్, తిరుపతిగౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

11నుంచి 13 వరకు వైన్స్‌లు బంద్

సిరిసిల్ల క్రైం, మే 8: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఈనెల 11నుంచి 13వరకు వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు బంద్‌చేయాలని ఎక్సైజ్‌శాఖ ఆదేశాలు జారీచేసింది. జిల్లాలోని 48వైన్స్‌లు, 6 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఈనెల 11న సాయంత్రం 6గంటలకు మూసివేసి ఈనెల 13న సాయంత్రం 6గంటలకు తెరువాలని పేర్కొంది. దాదాపు 48గంటలపాటు వైన్స్‌లు మూతపడనున్నాయి. మళ్లీ జూన్ 4న కౌంటింగ్ రోజు వైన్స్‌లు మూసివేయాలని ఎక్సైజ్‌శాఖ ఆదేశించింది.

గంభీరావుపేటలో వర్షం

గంభీరావుపేట, మే 8: గంభీరావుపేట మండలం శ్రీగాధ, రాజుపేట, కొత్తపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిని వర్షానికి కోతకు వచ్చిన పంటలు దెబ్బతినగా, కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై నిల్వ చేసిన ధాన్యం తడిసి పోయింది. ఈదురు గాలుల వర్షానికి కొన్ని గ్రామాల్లో గంటకుపైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల వర్షానికి కోతకు వచ్చిన పంటలు దెబ్బతినడం, మరో వైపు కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 : నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు ముందురోజు కేంద్రాన్ని నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు జరిగిన తీరును పర్యవేక్షించి నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకు సమర్పించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, శ్రీనివాసచారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లకుర్మల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, మే 8: గొల్లకుర్మల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రాధాన్యమిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గొల్లపల్లి, వెంకట్రావుపల్లె గ్రామాలలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాలలో బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికారప్రతినిధి పసుల వెంకటి, నాయకులు పర్శరాం, బీరయ్య, హనుమయ్య, మంద లింగయ్య, కర్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిని కలిసిన సంక్షేమాధికారి



జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన సంక్షేమశాఖ అధికారి

సిరిసిల్ల క్రైం, మే 8: సిరిసిల్ల జిల్లా కోర్టులోని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాధిక జైస్వాల్‌ను జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందరభంగా మహిళలపై జరుగుతున్న వేధింపులు, బాధితులకు పున రావాసం, ఆర్థిక సదుపాయాలు, వయోవృద్ధుల ఆశ్రమంలో అవాసితుల సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులకు లీగల్ సహాయంపై, సఖీ బాధితులకు డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్ ఫైలింగ్, కౌన్సెలింగ్‌పై సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సాధికారికత కేంద్రం కో ఆర్డినేటర్ రోజా, లీగల్ కం ప్రొబేషన్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

సహారాకు రెడ్ కార్పెట్ వేస్తున్న బీజేపీ



వేములవాడలో మాట్లాడుతున్న సహారా బాధితులు

వేములవాడ, మే 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 13 కోట్ల మంది ప్రజలను మోసం చేసిన సహారా కంపెనీకి రెడ్ కార్పెట్ వేస్తోందని సహారా బాధితులు ఆరోపించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా తమ బాధలు తెలియజేయడానికి వస్తే పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పెద్ద పెద్ద హోదాల్లో ఉన్న వ్యక్తులు సహారా ఇండియా కంపెనీని నడిపారని, మొత్తం 13 కోట్ల మంది ప్రజల నుంచి 86 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేశారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోనూ 2 కోట్ల 80 లక్షల మంది సహారా బాధితులు ఉన్నారన్నారు. చిన్నాచితక పొదుపు మొత్తాల్లో కుటుంబ అవసరాల కోసం డబ్బును దాచుకుంటే ఆ డబ్బును దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడిన కంపెనీ డైరెక్టర్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపాడుతున్నదని ఆరోపించారు. కంపెనీ వద్ద 24 వేల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ సహారాలో దాచుకున్న వారికి ఇవ్వకుండా బీజేపీ ఎన్నికలకు వాడుకుంటోందని ఆరోపించారు. బీజేపీ ముసుగులో సహారా నడుస్తోందన్నారు. న్యాయం కోసం మూడు మాసాలపాటు ఢిల్లీలో నిరసన దీక్ష చేసినా పట్టించుకోకపోగా బాధలు చెప్పుకునేందుకు వచ్చిన విశ్వ గురువుకు పేదల బాధలే వినిపించే పరిస్థితి లేకపోవడం దురదృష్టకరం అన్నారు. డైరెక్టర్ రావిపాటి రామకోటేశ్వరరావును అరెస్టు చేసినా డబ్బు పలుకుబడితో 24 గంటల్లో బయటకు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని బాధితులను సీఎం రేవంత్ రెడ్డి ఆదుకోవాలన్నారు. నిజామాబాద్, వరంగల్, జనగామ రాజన్న సిరిసిల్ల జిల్లా, సిద్దిపేట, ఆర్మూర్ ప్రాంతాల నుంచి మోదీకి విన్నవించుకుందామని వస్తే పోలీసులు అరెస్టు చేశారని, తర్వాత వదిలిపెట్టారని తెలిపారు. స్థానిక సహారా బాధితులు పూజిత, బాలయ్య, నర్సయ్య, గంగాధర్, చందు, కొండయ్య, లలిత, గణేష్, వనజ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ బస్సుయాత్ర ఏర్పాట్ల పరిశీలన



పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 8: ఈ నెల 10 సిరిసిల్ల పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర సందర్భంగా ప్రధానదారులు, సభ స్థలిని బీఆర్ఎస్ నేతలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ముస్తాబాద్ ఎంపీపీ జనగాం శరత్‌రావు, నాయకులు బొల్లి రామ్మోహన్‌రావు, కుంబాల మల్లారెడ్డి, సామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

కోనరావుపేట, మే 8 : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని, బీజేపీని ఓడించాలని జై భీమ్ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు నరేష్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిస్తేనే బడుగు బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీజేపీ గెలిస్తే ఇక ఎన్నికలు ఉండవని, రాజ్యాంగాన్ని మార్చేస్తారని అన్నారు. అందుకే ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు, కాంగ్రెస్ గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై రైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చందుర్తి, మే 8: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు బుధవారం చందుర్తిలో నిరసన తెలిపారు. చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తికి చెందిన రైతులు ధాన్యం జాప్యాన్ని నిరసిస్తూ చం దుర్తి సింగిల్ విండో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయంకి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య మాట్లాడుతూ మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యిం దన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి నెలరోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు 50 శాతం వరకు దళారులే రైతుల ధాన్యం తూకం వేశార న్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించి కొనుగోలు కేంద్రాల్లో సీరియల్‌గా, ధాన్యం సక్రమంగా తూకం వేయడం లేదన్నారు. చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్‌ను, సిబ్బందిని అడిగితే లారీల కొరతతో ధాన్యం కొను గోలు ఆలస్యం అవుతుందని సమాధానం ఇస్తున్నారన్నారు. జిల్లా అధికారుల తో మాట్లాడితే ప్రతి రోజూ 15 లారీలలో ధాన్యం తరలిస్తూ, ధాన్యం తూకం వేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు తప్ప, కొనుగోలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, లేనిచో రైతులు రోడ్డుపై ధర్నా చేయక తప్పదన్నారు. అవసరమనుకుంటే చలో కలెక్టర్ చేపడతామ న్నారు. సంచికి 41,600 చెప్పి కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నార న్నారు. ధాన్యం తూకం వేసిన లారీకి 240 క్వింటాలు తరుగు పేరున కటింగ్ చేస్తున్నారన్నారు. చందుర్తికి చెందిన బత్తుల వసంతరావు అనే రైతుకు 80 కిలోలు, మర్రి నిశాంత్ అనే రైతుకు చెందిన ధాన్యం 80 కిలోలు, బత్తుల సూర్యరావు 80 కిలోలు కటింగ్ చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవారెడ్డి సత్తిరెడ్డి, తిప్పని శంకర్, తిప్పని గంగయ్య, గుమ్మ శంకర్, దుమ్ము నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యులకు విందు.. ఎన్నికల అధికారుల విచారణ

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు హుజూరాబాద్ మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల ఫ్లాయింగ్ స్క్వాడ్, పోలీసులు సదరు ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. ఇది గమనించిన ఆర్‌ఎంపీ వైద్యులు, విందు ఇచ్చిన సదరు రాజకీయ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఎన్నికలాధికారులు అడ్డుకొని విచారించారు. సదరు ఆర్‌ఎంపీ వైద్యులు ఎన్నికలాధికారులు నిలదీయగా, బర్త్‌డే ఫంక్షన్‌కు వచ్చామని తెలిపారు. బర్త్‌డే ఫంక్షన్ చేసుకుంటే ఎన్నికలాధికారి అనుమతి తీసుకోవాలని ఎన్నికలాధికారులు ప్రశ్నించారు. ఈ లోగానే ఆర్‌ఎంపీ వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అప్పటికే ఆర్‌ఎంపీ వైద్యులకు గ్రామాల్లో ప్రచారం చేయడానికి నజరానా ముట్టజెప్పినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల క్రితం కూడా ప్రైవేట్ టీచర్లకు ఈ ఫంక్షన్ హాల్‌లో విందు ఇచ్చినట్లు తెలిసింది. పూర్తి నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వను న్నట్లు ఫ్లాయింగ్ స్క్వాడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, మే 8: గంగాధర గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్‌కు విద్యుత్ ఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర పంచాయతీలో షహీద్ పాషా విద్యుత్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బుధవారం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి విద్యుత్ సిబ్బంది షహీద్‌ను తీసుకెళ్లారు. కాగా సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్న లైన్‌మెన్ జంపర్ మార్పిడి చేయడానికి షహీద్‌ను స్తంభం ఎక్కించారు. రాంగ్ ఎల్‌సీతో షహీద్ విద్యుత్ షాక్‌తో కిందపడిపోయాడు. దీంతో అతడి కుడి చేయి నరాలు పూర్తితెగిపోయినట్లు సమాచారం. క్షతగాత్రుడిని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని తెలిసింది. దీనిపై ఏడీని వివరణ కోరగా సబ్ స్టేషన్ ఆపరేటర్, లైన్ మెన్ కమ్యూనికేషన్ లోపంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, మే 8: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లవేని శ్రీనివాస్ రోజులాగే తన పొలం వద్ద లేగ దూడను కట్టేసి ఉంచాడు. మంగళవారం రాత్రి లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. 40 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం

- గుడిసె, పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ శివారులోని మైసమ్మ చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రైతులు అల్లె ముత్తయ్య, ప్రదీప్, కొల కాని లక్ష్మయ్య, రవి, శ్రీనివాస్‌కు చెందిన సుమారు 100 గడ్డి కట్టలు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిపోయాయి. అల్లె ముత్తయ్య, ప్రదీప్‌కు చెందిన గుడిసెతోపాటు అందులోని సామగ్రి దగ్ధమయ్యాయి. చుట్టు పక్కల రైతులు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. అధికారులు నష్టం అంచనావేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రమా దం జరిగిన తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఏఎంసీ ఛైర్మన్, అందె సుభాష్, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్, శంకర్, శేఖర్ సతీష్ కోరారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మే 8: చదువుకోమంటూ తల్లి మందలించడంతో కూతురు ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన శ్రీనిధి ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతోంది. హైదరాబాద్ వెళ్లి పరీక్ష రాయాల్సి ఉందని, సెల్‌ఫోన్‌తో కాల క్షేపం చేయవద్దంటూ తల్లి పద్మ కూతురును మందలించింది. అనంతరం ఆమె పనికి వెళ్లింది. ఇంట్లో ఉన్న శ్రీనిధి తల్లి మాటలకు మనస్థాపం చెంది తన ఎడమ చేయి మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిఫా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్



నిఫా కార్యవర్గసభ్యులతో కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, మే 8: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్ అండ్ ఆక్టివిస్ట్స్ (నిఫా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌లోని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ నియామకమయ్యారు. ఢిల్లీలో జరిగిన నిఫా జాతీయకార్యవర్గ సమావేశంలో కొలగాని శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ నిఫా ఆర్గనైజేషన్‌లో భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన నిఫా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. నిఫా జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

మద్యం పట్టివేత

మానకొండూర్, మే 8 : మానకొండూర్ మాజీ సర్పంచు పృథ్వీరాజ్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బుధవారం రాత్రి పట్టుకున్న ట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సమాచారం మేరకు పృథ్వీరాజ్ ఇంటిపై దాడి చేయగా 48 రాయల్ స్టాగ్ ఖ్వాటర్స్, 22 బీర్లు లభ్యమైనట్లు సీఐ తెలిపారు. మద్యం విలువ రూ. 15 వేలు కాగా వాటి ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సజావుగా ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు



తిమ్మాపూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 8: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షల బుధవారం జిల్లాలో రెండో రుజూ సజావుగా జరిగాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగింది. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,931 మంది విద్యార్థులకు గానూ 2,738 మంది హాజరయ్యారు. మొత్తంగా 93.42శాతం హజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళ, బుధ వారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం పరీక్షలు జరిగాయి. కాగా 9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తిరిగి మధ్నాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు.

స్వగ్రామం చేరిన యువకుడి మృతదేహం

బీర్‌పూర్, మే 8: గల్ఫ్ దేశంలో చికిత్స పొందుతూ మృతిచెందిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బంద్ర రాజేష్(30) అనే యువకుడు కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయికి వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఏప్రిల్ 27న దుబాయ్‌లో మృతి చెందాడు. రాజేష్ మృతదేహం గ్రామానికి రావడంతో రాజేష్ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

జగిత్యాలలో వైద్యుల ఆందోళన



మాట్లాడుతున్న తాటిపాముల సురేష్

జగిత్యాల టౌన్, మే 8 :జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు శ్రవణ్, సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ హాలులో అధ్యక్షుడు తాటిపాముల సురేష్ కుమార్ మాట్లాడుతూ వైద్యునితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు రోగుల బాగుకోసమే పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అజయ్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ కళ్యాణ్ కుమార్, వైద్యులు సుధీర్, రమేష్, శ్రీనివాస రెడ్డి, సుజిత్, సురేష్, వేణు బాబు, రాహుల్, రాము, మహేంద్ర నాథ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పనుల ప్రగతి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నాబార్డు నిధులతో చేపట్టిన పనుల ప్రగతిని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర బుధవారం పరిశీలించారు. నాబార్డు ద్వారా అందిస్తున్న పథకాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆధునిక భవనం, గోదాం, సర్వేపల్లి శివారులోని పెట్రోలు బంకును పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలకు నాబార్డు కింద నిధులను అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ ప్రగతి పథంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర అన్నారు. అధికారులు సత్యనారాయణ, విష్ణు, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ ఉన్నారు.

అడవిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

రాయికల్, మే 8: అడవిని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఉపాధిహామీ కూలీలతో సమావేశమై మాట్లాడుతూ ఇంకుడు గుంతలు తీయడం వల్ల వర్షాకాలంలో నీరు భూమిలోకి ఇంకుతాయని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. వర్షాలు పడటంతో పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించారు. అడవులను కాపాడుకోవడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, ఉష్ణోగ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ వారి ఇళ్లల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అడవిని ఎవరైనా నరికితే అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రణీత్ కౌర్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రవి కుమార్, ఎఫ్‌బీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి గోడు వెల్లబోసుకున్నారు. సుమారు గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి వేతనం పెంపుదల జరగడం లేదని వివరించారు. సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో పీడీఎస్, సీఎంఆర్, ధాన్యం రవాణా, ఎంఎల్ఎస్ పాయింట్ గన్నీస్, గోడౌన్, క్యాషియర్ తదితర విభాగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు జి వంశీ, అరవింద్, మధు, సతీష్, జగన్, సంజయ్, రాంరెడ్డి, శ్రీనివాస్, రాజు, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతీ ధాన్యం గింజ కొంటాం



గంగాధరలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చౌహాన్

- రైతులకు నష్టం జరగనివ్వం
- ఎలాంటి ఆందోళన చెందొద్దు
- తరుగుపేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు
- పంటకు మద్దతు ధర అందిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

గంగాధర, మే 8: అకాల వర్షానికి తడిసిన ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గంగాధర మండల కేంద్రంతో పాటు మధురానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోనే ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా, మద్దతు ధర అందుతుందా, అకౌంట్లో డబ్బులు పడ్డాయా అని వివరాలు అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మనోధైర్యం, భరోసా కల్పించేందుకే జిల్లాలో పర్యటిస్తున్నానన్నారు. రైతులకు నష్టం జరగనివ్వమని, ఏలాంటి భయం వద్దని చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులైనా తాము భరిస్తామని రైతులకుఇబ్బంది కలగనివ్వమన్నారు. మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క గ్రాం ధాన్యమైన కోత విధించే అధికారం మిల్లర్లతో పాటు ఎవ్వరికి లేదని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో అధికారులతో సమావేశం నిర్వహించి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతితోను పలు అంశాలపై మాట్లాడానని తెలిపారు. అకాల వర్షం పడే అవకాశం ఉన్నందున వారం రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. తేమశాతం సరిగా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్లకు సమాచారం ఇచ్చి ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. ఆ తరువాత తూకం వేసిన ధాన్యం తడిసిన రైతులకు ఏలాంటి నష్టం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు. ధాన్యం బాయిల్డ్ రైస్‌కు ఉపయోగపడుతుందని, మిల్లర్లకు సైతం ఏలాంటి నష్టం కలగదని చెప్పారు. అధికారుల ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని క్లీన్‌చేసి కొనుగోలుకేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధర పొందవచ్చని సూచించారు. అధికారులు ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్, గంగాధర ఏడీఏ రామారావు తదితరులు ఉన్నారు.

● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

భగత్‌నగర్, మే 8: రైతులకు ఇబ్బందులు రాకుండా తేమ శాతం సరిగా రాగానే ధాన్యాన్ని తూకం వేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సెల్‌నెంబర్‌లు నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది, ఎంత డబ్బు జమ చేశారు అని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ ద్వారా రైతు లచ్చయ్యతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.



మల్యాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న కమిషనర్ చౌహాన్

మల్యాల: అకాల వర్షాలతో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. మల్యాల మండలంలోని రామన్నపేట, మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరనే అపోహలు, అనుమానాలు వద్దని రైతులకు నష్టం జరుగకుండా చూస్తామని తెలిపారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తూకం వేయడంతో నష్టపోతున్నామని ఈ సందర్భంగా రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బస్తాకు 40 కిలోల 600 గ్రాముల కన్నా ఎక్కువ ఏ మాత్రం తూకం వేయకూడదని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయాన్ని తాను మిల్లర్ల సమావేశంలో తెలుపుతానని అన్నారు. గతంలో కన్న ముందుగా ఈ సారి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కొనుగోళ్లు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచుల కొరత లేదని తెలిపారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉందని నిర్వాహకులు తెలపగా అక్కడే ఉన్న పౌరసరఫరాల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం విక్రయించిన రైతులకు ఫోన్ చేసి ధాన్యం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయా లేదా అని తెలుసుకున్నారు. కమిషనర్ వెంట అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, సివిల్‌సప్లయ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్ హతీరాం, డీపీఎం విజయభారతి, మల్లేశం, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏపీవో చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: వేగంగా వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని పౌర సరఫరాలకమిషనర్ డీఎస్ చౌహాన్‌ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంకిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి డబ్బులు పొందిన రైతుతో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడి ద్వారా కమిషనర్ ఫోన్‌చేయించి స్వయంగా మాట్లాడారు. డబ్బులు ఎన్ని రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని, ఏమైనా ఇబ్బందులు ఎదురు అయ్యాయా అని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కాలేదని సదరు రైతు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధాన్యం సేకరణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీవో పాపారావు తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మే 8: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. కరీంనగర్‌లో పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 2లక్షల 9 వేల 6 వందల రూపాయలు నగదు పట్టుబడిందని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తిలక్‌రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద సరైనా ఆధారాలు లేకుండా నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదును తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 58,800 నగదు పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మోరె విజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ. 58,800 నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న నగదును సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 9.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మధరావు తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా తమ ద్విచక్ర వాహనాలపై 1.80 లక్షలు, 1.50 లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదుకు ఎలాంటి ఆధారాలను చూపించక పోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకొని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ. 50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు

400 చీరలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మే 8 : కరీంనగర్‌లో పోలీసులు బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో 400 చీరలు పట్టుబడ్డాయి. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో వ్యాన్(టీఎస్ 13 ఈబీ 2549)లో సరైన రశీదులు లేని అక్రమంగా తరలిస్తున్న దాదాపు 3 లక్షల రూపాయల విలువ చేసే 400 చీరలతో పాటు ఇతర దుస్తులను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ నుంచి ధర్మపురికి ఈ చీరలు తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన చీరలను తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు. విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.



చీరలను పట్టుకున్న పోలీసులు

అక్రమ లేఅవుట్లపై విచారణకు ఐజీ ఆదేశం

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలో ఏడాది కాలంలో ఏర్పాటు చేసి అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల క్రితం జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో అమ్మిన భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. కాగా నాలుగు రోజులుగా దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విచారణతో నాలా కన్వర్షన్, మున్సిపల్ అనుమతి లేకుండా భూములు కొనుగోలు చేసిన వారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఈ విచారణ జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే ముందస్తుగానే సెలవుపై వెళ్లాడు. దీంతో మరొకరిని సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్న కుంభకోణాలు బయట పడనున్నాయి.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

మెట్‌పల్లి, మే 8: కోరుట్ల ప్రభుత్వ ఆసపత్రిలోని డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల కితం జరిగిన సంఘటనలో డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ప్రతి వైద్యుడు తమ వద్దకు వచ్చిన రోగిని కాపాడాలనే నిబద్ధతో వైద్యం చేస్తారన్నారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఒంటిపై కిరోసిన్ పోయడంతో పాటు దాడి చేయడాన్ని ఐఎంఏ తరుపున ఖండిస్తున్నట్లు తెలిపారు. వైద్యుడిపై దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ యూనియన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆనంద్‌బాబు, జాకబ్‌కిరణ్, రమేష్‌రెడ్డి, విద్యాసాగర్, త్రిలోక్, నిర్మల్‌రెడ్డి, పద్మ, త్రివేణి, మానస, సభ్యులు,తదితరులు పాల్గొన్నారు,



ప్రజలు, పార్టీశ్రేణులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు వస్తున్న ప్రజలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రధాని మోదీ, ఇతర నేతల భారీ కటౌట్లు

ప్రధాని మోదీ సభ

చిత్రమాలిక

వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజ య్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రే ణులు సంతోషం వ్యక్తం చేశాయి.



సభకు తరలివస్తున్న మహిళలు



సభకు హాజరైన మహిళలు



సభ వద్ద పోలీసుల బందోబస్తు



సభకు హాజరైన జనం, కార్యకర్తలు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

‘ప్రసాద్’ నిధుల ఊసే ఎత్తని మోదీ

- పదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యం - మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్/ చందుర్తి మే 8 : దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ప్రసాద్ పథకం కింద ప్రధాని మోదీ నిధులు ప్రకటిస్తారని అనుకున్నామని, రాజన్న ఆలయ అభివృద్ధిపై ఊసేత్త లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడారు. బీజేపీ నాయకులు దక్షిణ కాశీ అభివృద్ధిపై మాట్లాడతారే కానీ ఎలాంటి నిధులూ మంజూరు చేయలేదన్నారు. పదేళ్లలో అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలిపించాలన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వెలిచాల రాజేందర్ రావు గెలిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

● కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు భారీ మెజార్టీతో గెలువబోతున్నాడని, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓటమి పాలవుతున్నాడని తెలిసిన ప్రధాని నరేంద్రమోదీ హుటాహుటిన వేములవాడకు వచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద కార్నర్ మీటింగ్‌లో బుధవారం మాట్లాడారు. దక్షిణకాశీకి వచ్చిన మోదీ రాజన్న ఆలయ అభివృద్ధిపై ఎందుకు మాట్లాడలేదన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయం గురించి ప్రధాన మంత్రి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.



వెలిచాలను గెలిపించాలని కోరుతున్న ఆది శ్రీనివాస్

● బతికున్నంత కాలం అవినీతికి పాల్పడనని ప్రామాణం చేస్తున్నానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. వేములవాడ రోడ్‌షోకు వచ్చిన ఆయన మాట్లాడారు. తన తండ్రి కరీంనగర్ ఎమ్మెల్యేగా పని చేశారని, తాను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా పదవులు చేపట్టానని, తమ కుటుంబంపై అవినీతి ఆరోపణలు లేవన్నారు.

● వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

కోనరావుపేట : రైతు వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలని, పేదల పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మంగళపల్లి ఆర్య క్షత్రియ సంఘం నాయకులు, పల్లిమక్తకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, అభివాదం చేస్తున్న రాజేందర్‌రావు

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు

రుద్రంగి: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో పేదలు మరింత పేదలుగా మారారని, బండి సంజయ్ మన ప్రాంతానికి చేసిందేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మీ బిడ్డను గెలిపించారని, మీ బిడ్డకు తోడుగా ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజలకు సేవ చేసేందుకే..

ప్రజలకు సేవ చేయడానికి ఎన్నికల్లో నిలబడినట్లు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. కరీంనగర్ పరిధిలో ఎంపీల్యాడ్స్ కింద రూ.25 కోట్లు మంజూరవగా 5 కోట్లు మాత్రమే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. మిగతా రూ.20 కోట్లు ఖర్చు చేయడం చేతకాక మురిగిపోయాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తోందన్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ మీనయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలపతి పాల్గొన్నారు.

రాజకీయాల కోసమే మోదీ పర్యటన

- వేములవాడ రాజన్న గుడికి నయా పైస ఇవ్వలేదు - బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మానకొండూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మే 8: వందల కోట్లతో వారణాసి (కాశీ)ని అభివృద్ధి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న గుడికి మాత్రం నయాపైస ఇవ్వకుండా పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈరోజు వేములవాడకు వచ్చిన మోదీ పర్యటన పూర్తిగా రాజకీయాల కోసమే తప్పా వేములవాడ రాజన్న గుడి అభివృద్ధి కోసం, ఈ ప్రాంత ప్రజల కోసం రాలేదని విమర్శించారు. రాజన్న గుడిలో పూజలుచేసిన ప్రధాన మంత్రి రాజన్న గురించి ఒక్క మాట మాట్లాడలేదని, ఒక్క హామీ కూడా ఇవ్వలేదని అన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన వేములవాడ దేవస్థానం గురించి మాట్లాడక పోవడం శోచనీయమని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను ఒక సర్క్యూట్ చేయాలని, అభివృద్ధి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని గతంలో కోరామన్నారు. మోదీ సర్కార్ ఇందుకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. రాజన్న గుడిని బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చేశామని వినోద్‌కుమార్ చెప్పారు.దేవుడి పేరుతో రాజకీయాలు చేసే ఎంపీ బండి సంజయ్‌కుమార్ రాజన్న గుడికి నిధులు ఇవ్వాలని ఎందుకు ప్రధానిని అడగలేదని ప్రశ్నించారు. ఇతర సమస్యలపైగాని ఒక్క మాటకూడా ప్రధాని మోదీ ముందు అడగలేని సంజయ్ ఎంపీగా ఉండడమెందుకన్నారు. ఎంపీగా తన బాధ్యతలను బండి సంజయ్ పూర్తిగా విస్మరించారని వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదనే అసహనంతో ప్రధాని మోదీ నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను గుంజుకునే హక్కు ఎవరికి లేదన్నారు. 2006లో సుప్రీం కోర్టు జస్టిస్ బాలకృష్ణ రిజర్వేషన్లను ముట్టుకునే వీలు ఎవరికి లేదని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని, ఎస్సీ, ఎస్టీలను రాజకీయాలకు వాడుకోవద్దని హెచ్చరించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీ కావాలో దేవుడి పేరుతో రాజకీయాలు చేసే బండి సంజయ్ కావాలో తేల్చుకోవాలని, మరోసారి తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని వినోద్‌కుమార్ కోరారు. ఎమ్మెల్సీలు ఎల్ రమణ, టి భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, అక్బర్ హుస్సేన్, పన్యాల భూపతిరెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నవాజ్, వాజిద్, సాయికృష్ణ, కుల్‌దీప్‌వర్మ, సంపత్‌గౌడ్, మోహన్, హరిప్రసాద్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

● బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు..

మానకొండూర్: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఐదు పైసల అభివృద్ధి పనులు చేయలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మానకొండూర్‌లో బుధవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడకు ప్రధానమంత్రి రావడం సంతోషకరమని, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎందుకు హామీ ఇవ్వలేదో బీజేపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఆదరించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకురాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ చైర్ పర్సన్ తుల ఉమ బుధవారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్‌ను తీసుకొని మూడో నంబర్ మీద ఉన్న కారు గుర్తు మీటను నొక్కాలని సూచించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వినోద్ కుమార్‌ను గెలిపించాలని తుల ఉమ కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు నిర్మలారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు రమేష్, సురేష్, ఎల్లయ్య, దేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న తుల ఉమ

● రాజన్న ఆలయంలో ప్రధాని మోదీ



బీజేపీ జనసభలో పాల్గొనేందుకు బుధవారం వేములవాడ వచ్చిన ప్రధాని మోదీ ముందుగా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రధాని నరేంద్రమోదీ భక్తులకు అభివాదం చేశారు.



ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 8: మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాష్ కేక్ కట్ చేశారు. టీపీసీసీ సభ్యులు సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకటరమణ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు లక్ష్మినారాయణ, లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, సర్దాపూర్, పెద్దూర్, రగుడు, పెద్దబోనాలలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చంద్రంపేటలో సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి గంబీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షులు ప్రశాంత్, నూనె శ్రీనివాస్, ఓబీసీసెల్ పట్టణ ప్రధాన కార్యదర్శివేణగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, గౌస్, లింగాగౌడ్, బుచ్చాగౌడ్, రాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తాడూరు చౌరస్తాలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి చుక్క రాజశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ - రచన ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలనీలో మాజీ సర్పంచ్ బైరి శ్రీవాణి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలో కరీంనగర్ పార్లమెంటరీ కో ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జడ్పీటీసీ నర్సయ్య, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, నర్సింలు, గుండెల్లి శ్రీనివాస్, రాజు, దేవయ్య, మల్లేశ్‌గౌడ్, శ్రీకాంత్, శీల ప్రశాంత్, పెద్దిగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవాడ: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం వేములవాడలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ బింగి మహేశ్, కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పుల్కం రాజు, పాత సత్యలక్ష్మి, కూరగాయల కొమరయ్య గూడూరి మధు, ఇప్పపూల అజయ్, పులి రాంబాబు గౌడ్ పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

బీరప్ప ఉత్సవాల్లో వినోద్‌కుమార్



మొక్కులు చెల్లించుకున్న వినోద్‌కుమార్

ఇల్లంతకుంట, మే 8: మండలంలోని గొల్లపల్లె, వెంకట్రావుపల్లెలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎంపీటీసీ నర్సయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచులు

ఇల్లంతకుంట, మే 8:మండలంలోని జంగమరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ తూముకుంట శ్రీలతరెడ్డి, ఇల్లంతకుంట మాజీ సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మీ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ రమణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, మాజీ ఎంపీపీ అయిలయ్య, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు

సిరిసిల్ల టౌన్, మే 8: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంట్ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిలర్, రాష్ట్ర క్రైస్తవ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీ వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రకటించిన గ్యారంటీలు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలు అద్భుతంగా ఉన్నాయన్నారు. తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిలర్, రాష్ట్ర క్రైస్తవ సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమే

వీర్నపల్లి, మే 8 : కేంద్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ వీర్నపల్లికి చేసిన అభివృద్ధి పనులు శూన్యమన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నరేష్, కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట ,మే 8: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులో ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ రవాణా ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు నిర్వాహకుడు అజీజ్ ఆధ్వర్యంలోని ముస్లిం నాయకులు బుధవారం రాత్రి వేములవాడలో ఆహ్వాన పత్రం అందజేశారు. నాయకులు సాహెబ్ ,షాదుల్లా, తదితరులు ఉన్నారు.

అందరి చూపు కాంగ్రెస్ వైపు

తంగళ్లపల్లి, మే 8: అందరి చూపు కాంగ్రెస్ వైపే ఉందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపు ఖాయమైందని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో మాజీ సర్పంచ్ బైరి శ్రీవాణి రమేష్ ఆధ్వర్యంలో కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి, మండల కాంగ్రెస్అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ పోలీసుల అదుపులో బైక్ దొంగల ముఠా?

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండలంలోని బైక్ దొంగల ముఠాను బుధవారం కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు, వారి వద్ద నుంచి ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కరీంనగర్ పట్టణంలో రెండు నెలల కిందట ఓ వ్యక్తికి చెందిన బైక్ చోరీకి గురైంది. సదరు బాధితుడు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనంతో మండల కేంద్రంలో తిరుగుతున్నాడు. ఇక్కడి పోలీసులు జరిమానా విధించడంతో బాధితుడికి సెల్‌ఫోను ద్వారా సమాచారం చేరింది. కరీంనగర్ పోలీసులకు విషయం వివరించడంతో రంగంలోకి దిగినట్లు తెలిసింది.

పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పథకాలు



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సిరిసిల్ల రూరల్ /ముస్తాబాద్, మే 8 : పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కరీంనగర్ పార్లమెంటరీ కో ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీపుల్స్ హాస్పిటల్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ రాజారాంతో పలువురిని కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం ఆలోచిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏనుగు వేణు, షాదుల్‌పాషా, బండి శ్రీకాంత్, ఆగంరెడ్డి, దీటి నర్సింలు, ప్రతాపరెడ్డి, సద్ది మధు, కనమేని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, పెద్దబోనాల, చంద్రంపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బుధ వారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరదేవరాజు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, వార్డు అధ్యక్షులు మంగ ప్రశాంత్, రమేష్, యూత్ అధ్యక్షుడు శ్యాం, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట, బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, తిమ్మాపూర్, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. రాజేందర్ రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాములు, రాజేందర్, రాజునాయక్, దేవయ్య, రవి, రవీందర్‌రెడ్డి, కిషన్, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.

వీర్నపల్లి : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందరన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కుటుంబ సభ్యులు వెలిచాల శిరీష, సంధ్య, ప్రతిభ అన్నారు. వీర్నపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ నాయకులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్, మండల మహిళా అధ్యక్షురాలు జోగుల మంజుల, గ్రామ అధ్యక్షుడు పెడతనపెల్లి చంద్రమౌళి, సీనియర్ నాయకులు లెంకెల లక్ష్మణ్, జోగుల కాంతయ్య, లకావత్ రాములు, లెంకల రాజు, పని శివరామకృష్ణ, నందగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస పార్టీకి ఓటు వేయాలని పీసీసీ కోఆర్డీనేటర్ పాశం రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, ఒగులాపూర్‌లో బుధవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎంపీటీసీ స్వప్నకర్ధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, కనుకయ్య మోహన్, లచ్చయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో వెలిచాల కుటుంబ సభ్యుల ప్రచారం

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

సిరిసిల్ల టౌన్, మే 8: బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం 6వ వార్డులో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను వివరిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, నాయకులు వెంకన్న, బాబీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్ అన్నారు. మండలంలోని ఇల్లంతకుంట, కందికట్కూర్, రామోజీపేట, వంతడుపులలో బుధవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో సమస్యలపై మాట్లాడిన ఘనత వినోద్‌కుమార్‌కు ఉందన్నారు. గతంలో ఎంపీలుగా పనిచేసిన వారు ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు, నాయకులు సాదుల్, కూనబోయిన రఘు, సలీం, దొంతుల శంకర్, భాస్కర్, నర్సయ్య, దుర్గయ్య బాబు, భూమయ్య, రాగటి రమేష్, ప్రశాంత్, సుదగోని నరేష్, అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. దండం పెడుతున్నా.. బీఆర్ఎస్‌కే ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీఆర్ఎస్ ద్వారానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీలు అక్కరాజు శ్రీనివాస్, గోపాల్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు శీలం జనాబాయి, బత్తుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మంతెన సంతోష్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మల్యాల దేవయ్య తదితరులు ఉన్నారు.



ఇల్లంతకుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు